బెటాలియన్ కమాండెంట్‌గా ఎ.ఎస్.రాణా

ప్రజాశక్తి- డెంకాడ

ఎపిఎస్‌పి ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా అధిరాజ్‌సింగ్ రాణా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను పోలీసు అసోసియేషన్ సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ డైరీ 2024ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మిత్తిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, సెక్రటరీ మజ్జి శ్రీను, ఆర్ఐ ట్రెజరర్ పివిఆర్ మూర్తి, మెంబర్స్ రాంకుమార్, రాంబాబు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కమాండెంట్

పొత్తు పొసిగేనా..?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి, జనసేన పొత్తులో తగ్గేదెవరు? నెగ్గేదెవరు?... ఇదీ జిల్లాలో నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో సాగుతున్న ఆసక్తికర రాజకీయం. నెల్లిమర్ల సీటు కోసం జనసేన ఆశపడుతుండగా, అది గెలిచే సీటు కాబట్టి ఓసారి లోతుగా ఆలోచించాలని టిడిపి అధినేత అంటున్నట్టుగా సమాచారం. టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో సీట్ల కేటాయింపు విషయమై ఆయా పార్టీల అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఆదివారం రెండు దఫాలుగా చర్చించడం, రాష్ట్ర వ్యాప్తంగా 28సీట్లు జనసేనకు కేటాయించేందుకు పరస్పరం ఆలోచన చేసినట్టు వార్తలు రావడం విధితమే. అధినేతల చర్చల్లో నెల్లిమర్ల సీటుపై ఇరు పార్టీల నేతలూ ఆసక్తి చూపినట్టుగా తెలుస్తోంది. జిల్లాలోగానీ, నెల్లిమర్లలో గానీ జనసేనకు ఉన్న సొంత బలం ఎంత? అన్నది కాసేపు పక్కనబెడితే... నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి గతంలో పోటీచేసిన అభ్యర్థి ఈసారి ఎలాగైనా రంగంలోకి దిగేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పలుమార్లు పవన్ కల్యాణ్‌ను కలవడంతో తాజాగా ఇరు పార్టీల నేతల మధ్య జరిగిన చర్చల్లో నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం గురించి ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. మొత్తం తమకు కేటాయించబోతున్న సీట్లలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం కూడా వదిలిపెట్టాలని పవన్ కల్యాణ్ ప్రతిపాదన పెట్టినట్టుగా తెలిసింది. తమ పార్టీకి చెందిన స్థానిక నేత తొలి నుంచీ ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నారని, ఎన్నికల్లో పోటీని తట్టుకునే స్థోమత కూడా ఉందని, ఈనేపథ్యంలో తమకు రిజర్వు చేయాలని బాబుకు వివరించినట్టుగా సమాచారం. ఈ విషయంలో చంద్రబాబు తటపటాయించినట్టుగా తెలిసింది. ఆ స్థానంలో తాము దింపాలనుకుంటున్న అభ్యర్థి సామాజిక కోణాన్ని బట్టి సునాయాశంగా గెలిచే అవకాశం ఉంటుదని, జనసేన తరపున అటువంటి అవకాశం ఉంటుందా? లేదా అన్నది మరోసారి సున్నితంగా ఆలోచించాలని బాబు చూసించినట్టు సమాచారం.

నెల్లిమర్ల స్థానంలో గజపతినగరం సీటును కేటాయించే విషయంలో కూడా చర్చ జరినట్లు తెలిసింది. వాస్తవానికి నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అధికార ప్రతిపక్షాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ఓవైపు సముద్రతీరం, మరోవైపు విలాసవంతమైన రిసార్ట్స్, వాటికి ఆనుకుని వీటికి అనుసంధానంగా బెంగుళూరు-కోల్‌కత్తా జాతీయ రహదారి, దీనికితోడు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రాబోతున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఖరీదైన ప్రాంతంగా మారింది. ఎయిర్‌పోర్టు పూర్తయితే దేశ, విదేశాలకు చెందిన నేతలు, రాష్ట్ర కేంద్ర మంత్రులు ఈ ప్రాంతం నుంచే వచ్చిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ కూడా అనివార్యంగా ఎక్కువగానే ఉంటుంది. ఈ కోణంలో టిడిపి నెల్లిమర్లను అంత సులువుగా వదులుకునే పరిస్థితి లేదని పలువురు విశ్లేషిస్తున్నారు. అసలు తక్కువ సీట్లు, అందులోనూ పోటీచేసేందుకు అనువుగాను, అభ్యర్థులు ఆసక్తి చూపిన చోట ఇవ్వకపోతే ఎందుకు? అన్నట్టుగా జనసేనలో చర్చనడుస్తోంది. అధినేత పవన్ కల్యాణ్ కూడా ఇదే కోణంలో ఆలోచిస్తున్నారని సమాచారం. పొత్తు పొసుగులో టిడిపి, జనసేనల్లో ఏ పార్టీ వెనక్కి తగ్గుతుందో వేచి చూడాల్సిందే.

బకాయి బిల్లులు చెల్లించండి

- గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలి
- డిఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల బైఠాయింపు

డిఇఒ కార్యాలయం వద్ద బైఠాయించిన మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని , బకాయి బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలతోపాటు, గౌరవ వేతనం పది వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు డిఇఒ కార్యాలయం వద్ద సోమవారం బైఠాయించారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి. సుధారాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. 23ఏళ్లగా కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయిస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే రూ. 10 వేలు వేతనం ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5వ తేది లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని కోరారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ. 20కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, పథకాన్ని ప్రైవేటుసంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు అయిన మంచినీరు, వంటషెడ్, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటి డిఇఒబ్రహ్మాజీ వచ్చి కార్మికులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి-విజయనగరం

పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పరీక్షల నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు, 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పదోతరగతి పరీక్షలకు సుమారు 27,277 మంది హాజరవుతారని, వీరికోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు సుమారు 1600 మంది ఇన్విజిలేటర్లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలకు సుమారు 45వేల మంది హాజరు కానున్నారని, 94 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని, చుట్టుప్రక్కల జెరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. వేసవిని దష్టిలో పెట్టుకొని కేంద్రాలవద్ద వైద్య బృందాలను, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా పత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూములవద్ద, రూట్లలో, పరీక్షా కేంద్రాలవద్దా తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే విధంగా ఆర్‌టిసి బస్సుల వేళలను సవరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి, డివిఇఒ భీమశంకర్, ఆర్ఐఒ మజ్జి ఆదినారాయణ, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, మిమ్స్ ఉద్యోగులు

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఏడు నెలల డిఎ బకాయిలు చెల్లించాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం నగరంలో మూడు లాంతర్లు జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం ఉద్యోగులకు సంఘం లేకుండా చేసి గత మూడేళ్లుగా ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా నిరంకుశంగా చూసిందన్నారు. డిఎలు ఇవ్వకుండా ఉద్యోగులకు అన్యాయం చేసిందన్నారు. అడిగిన ఉద్యోగులను సస్పెండ్ చేయడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. ఐదు రోజులుగా మిమ్స్ వద్ద ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ముందస్తు నోటీసులు లేకుండా నేరుగా సస్పెన్షన్లు లేదా బదిలీలు చేస్తున్నారన్నారు. గతనెల 31న సమస్యలపై మాట్లాడినందుకు ఈ నెల 1న గేటు దగ్గర ఇద్దరు ఉద్యోగులను ఆపేసారన్నారు. దీంతో మిగతా ఉద్యోగులు విధులు బహిష్కరించారని తెలిపారు. అధికారులు స్పందించి యూనియన్‌తో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, వేతన ఒప్పందం చేయాలని, బదిలీ చేసిన ఉద్యోగులకు మిమ్స్‌లో డ్యూటీ ఇవ్వాలని కోరారు. రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు, కార్మిక శాఖ అధికారికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ, నాయకులు ఎం.నారాయణ రావు, కె.రామారావు, మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ నాగలక్ష్మి

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బిఎస్‌వి త్రివినాగ్ లతో కలసి జిల్లా కలెక్టర్ వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 199 వినతులు అందాయి. రెవిన్యూ శాఖ సమస్యలపై 132, డిఆర్‌డిఎ కు సంబంధించి 26, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 13 వినతులు అందాయి. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు మురళీకృష్ణ, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్ చేయాలి

నగరంలోని అయ్యప్పనగర్ లోఅక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చెయ్యాలని పట్టణపౌరసంక్షేమ సంఘం నాయకులు రెడ్డి శంకర్రావు కలెక్టర్‌కు వినతినిచ్చారు. పూసర్ల మధు సూదన రావు అక్రమంగా స్వాతీ ప్యూరి ఫైడ్ కూలింగ్ వాటర్ ప్లాంట్ ను నడుపుతున్నారని, వారికి ఎటువంటి అనుమతులూ లేవని అధికారులు ధ్రువీకరించి 8 నెలలైనా అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చెయ్యకుండా తాత్సారం చేయడం సరైనది కాదని అన్నారు. తక్షణమే అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేయాలని కోరారు. వినతినిచ్చిన వారిలో కాలనీ అసోసియేషన్స్ కార్యదర్శి సుదీర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది త్రినాథ్ ఉన్నారు.

– రెవెన్యూ అధికారులు ఇచ్చిన అక్రమ అడంగళ్లను రద్దు చేయాలని ప్రదీప్‌నగర్ సమీపాన గల శ్రీ సత్య సాయినగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. తమ పేరును ఉన్న అడంగళ్లను మార్చి వేరొకరి పేరు మీద ఇవ్వడం సరైనది కాదని అన్నారు.

యువతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

డ్రగ్స్‌కు యువత బానిస కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతూ టిడిపి నాయకులు కలెక్టర్‌కు వినతినిచ్చారు. ఇటీవల కాలంలో యువత రాష్ డ్రైవింగ్‌తో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. వినతినిచ్చిన వారిలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాజేష్‌బాబు, వేచలపు శ్రీనివసారావు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఎపిరైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యాన జామి మండలానికి చెందిన రైతులు గాడి శివ అచ్చం నాయుడు తదితరులు సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతినిచ్చారు.క్వింటాకు రెండు కిలోల చొప్పున మిల్లర్లు అధికంగా ధాన్యం తూకం వేసుకుంటున్నారని తెలిపారు. మిల్లుకు వేసిన ధాన్యానికి ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వకుండా అవస్థలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్ల దోపిడి నుంచి రైతులను ఆదుకోవాలని, అదనంగా తూకం వేస్తున్న ధాన్యానికి డబ్బులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

జెడ్‌పి చైర్మన్‌కు వినతి అందిస్తున్న ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం : విమానాశ్రయ నిర్మాణంతో గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పల నారాయణ సోమవారం జిల్లా కేంద్రంలోని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో ఉప్పాడపేట, ఎ.రావివలస జగనన్న కాలనీ, వెంపాడపేట, రాళ్లపాలెం, బైరెడ్డిపాలెం ఎర్రయ్య కల్లాలకు వెళ్లేందుకు రహదారులు లేవని తెలిపారు. శ్మశానానికి వెళ్లేందుకు కూడా రహదారులు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అప్రోచ్ రోడ్డుకు సంబంధించిన పరిహారం కూడా అందలేదన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సూర్యకళ, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు శివారెడ్డి తెలిపారు.

తెలంగాణ మాదిరి వేతనాలివ్వాలి

డిప్యూటీ స్పీకర్‌కు మెప్మా ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెప్మా సిబ్బందికి తెలంగాణ రాష్ట్రం మాదిరి పే స్కేలు వర్తింపజేయాలని, రెగ్యులర్ చేయాలని మెప్మా సిబ్బందికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి వినతినిచ్చారు. 2003 నుంచి ఎపి యుఎస్‌పిలో పనిచేస్తూ 2007 నుంచి మెప్మాలో సుమారు 860 మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అక్కడి మెప్మా ఉద్యోగులకు పే స్కేలు వర్తింపచేసిందన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వలన ప్రభుత్వం పై అధిక ఆర్థిక భారం పడదని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కె.అప్పలనాయుడు, కె.సన్యాసిరావు,ఎల్.వెంకటలక్ష్మి, టి.నూర్జహాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

9న డివార్మింగ్ డే

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిల్లల్లో రక్తహీనత, వివిధ రకాల అనారోగ్యానికి కారణమవుతున్న నులిపురుగులను నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా, పిల్లలందరితో ఒకేరోజు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా మింగించాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు వరకూ అందరితోను ఈ మాత్రలను వైద్యులు సూచించిన డోసుల మేరకు మింగించాలని చెప్పారు. అంతకుముందే నులిపురుగులు వల్ల కలిగే అనర్ధాలపై ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో సుమారు 1 నుంచి 19 ఏళ్ల మధ్య సుమారు 3,58,067 మంది ఉన్నట్లు గుర్తించామని, వీరికోసం 3,80,986 మాత్రలను సిద్ధం చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ ఎస్.భాస్కరావు, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

23 వేల టీచర్ పోస్టులు భర్తీచేయాలి ● టిడిపి ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, నిరుద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

షో వర్క్ డిఎస్‌సిని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మభ్యపెడుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక కోట వద్ద మెగా డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. దీనికి తెలుగు యువత, నిరుద్యోగ జెఎసి సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తానని హామీనిచ్చి నిలువునా మోసగించారని విమర్శించారు. ఐదేళ్లలో ఒక్కసారీ జాబ్ కేలండర్ విడుదల చేయలేదన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టడానికి అత్యవసరంగా కేబినెట్ పెట్టి 6 వేల డిఎస్‌సి పోస్టులను మాత్రమే ప్రకటించిందని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టులు ఏకోసాన పరిపోతాయని ప్రశ్నించారు. అనంతరం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ సిద్ధిక్ మాట్లాడుతూ 23 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు వి.చైతన్య బాబు, టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, నాయకులు వేచలపు శ్రీనివాసరావు, రాజేష్ బాబు, కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో

ఎఆర్ పోలీసుల పాత్ర చాలా కీలకం

మాట్లాడుతున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల పాత్ర కీలకమని అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు ఏటా నిర్వహించే 15రోజులపాటు పునశ్చరణ తరగతులను సోమవారం ఎఎస్‌పి ప్రారంభించారు. విధుల్లో నిష్పక్షపాతంగా, అంకిత భావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. శారీరక దారుఢ్యం పెంచేందుకు, వివిధ ఆయుధాల ఉపయోగాలను, ముఖ్యమైన బందోబస్తు విధులను ఏవిధంగా నిర్వహించాలో, ఫైరింగు ప్రాక్టీసు, బాంబు స్క్వాడ్ పనితీరు ఏవిధంగా చేపట్టాలో, మస్కట్ శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆర్ఎస్ఐ టి. శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, ఎఆర్ హెచ్‌సిలు, ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మోటారు కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

వాహనాల ఫిట్‌నెస్, బ్రేక్ సర్టిఫికెట్లు జారీ ప్రయివేట్ సంస్థలకు అప్పగించి మోటారు కార్మికుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చర్చి సెంటర్లో సోమవారం సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు వేయడంతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిట్నెస్ సర్టిఫికెట్లకు అధిక మొత్తంలో ఫీజు పెంచడాన్ని వైసిపి ప్రభుత్వం అంగీకరించడం దుర్మార్గమన్నారు. కొత్తగా ద్విచక్ర వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడాన్ని తప్పుబట్టారు. రవాణా రంగాన్ని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

త్వరితగతిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుల పరిశీలన

విజయనగరం : జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే తనిఖీ చేసి వారు అర్హులో కాదో తేల్చి వెంటనే నివేదికను అందజేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలకు తొలి విడతగా 276 మంది జర్నలిస్టుల సమాచారాన్ని మండలాలకు పంపించామని, ప్రభుత్వ నిబంధనల మేరకు వారు అర్హులా కాదా అనే విషయాన్ని తనిఖీ చేసి అర్హులైన వారికి కేటాయించే నిమిత్తం ఎంత భూమి అవసరం వుంటుందనే అంచనాలు రూపొందించాలని తెలిపారు. న్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో వుంటే ప్రభుత్వ భూమిలో కేటాయింపు కోసం ప్రతిపాదించాలని, లేదంటే ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూసేకరణ చేయాల్సి వస్తే భూముల ధర తదితర వివరాలతో నివేదిక పంపించాలని ఆదేశించారు. దీనిని అత్యంత ప్రాధాన్య అంశంగా భావించి ఆయా మండలాల నుంచి నివేదికలు త్వరగా పంపించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.ఎస్.వి.త్రివినాగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు

గేదెల రాజారావును హౌస్ అరెస్టులో ఉంచిన పోలీసులు

పిఆర్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి రాజారావు హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి – నెల్లిమర్ల

టిడిపి నాయకులు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావును పోలీసులు సోమవారం దన్నాన్‌పేటలో రాత్రి హౌస్ అరెస్టు చేశారు. ఈ నెల 6న సర్పంచులంతా ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా ఆయన్ను తన నివాసంలో ఎస్‌ఐ రామగణేష్ హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గేదెల రాజారావు మాట్లాడుతూ సర్పంచుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఛలో విజయవాడకు వెళ్లకుండా ప్రభుత్వం కక్ష పూరితంగా గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో అధికార పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఎస్.కోట కాంగ్రెస్ అభ్యర్థిగా గేదెల దరఖాస్తు

ప్రజాశక్తి – జామి

శృంగవరపుకోట నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ప్రముఖ వైద్యులు గేదెల తిరుపతిరావు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు విజయనగరంలో డిసిసి అధ్యక్షులు రమేష్‌కుమార్‌కు సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో తిరుపతిరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉంది. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తిగా నియోజకవర్గంలో అందరికీ సుపరిచితులు. జామి, గంట్యాడ, కొత్తవలస మండలాల్లో బంధుత్వాలు మెండుగా ఉన్న వ్యక్తి. ఈ నేపథ్యంలోనే డాక్టర్ తిరుపతిరావు శృంగవరపుకోట అభ్యర్థికి పోటీకి అవకాశం కల్పించాలని కోరడం సమంజసమేనని పలువురు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో వైఎస్ షర్మిల రాకతో ఆ పార్టీ పుంజుకుంటున్న తరుణంలో గేదెల టిక్కెట్ దరఖాస్తు చేయడం పట్ల చర్చ సాగుతోంది.

పట్టాలు పంపిణీ చేస్తున్న బెల్లాన వంశీకృష్ణ, శ్రీనివాసరావు

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి – చీపురుపల్లి

అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఎంపి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. సోమవారం ఎంపి తనయుడు విజయనగరం జిల్లా వైసిపి యువజన ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ దరఖాస్తు చేసిన 90 రోజులలో ఇళ్ల స్థలాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అర్హులై ఉండి ఇంటి స్థలం లేని వారు వాలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరెడ్డి రమణ, కర్లపు ఆదినారాయణ, తలసీల రాము, బలగ రమేష్, కంది దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి – భోగాపురం

బదిలీపై వెళ్లిన ఎంపిడిఒ నీలం అప్పలనాయుడును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గురించి పలువురు కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సురేష్, ఎఎ డి.బంగారయ్య, ఎపిఒ ఆదిబాబు, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, పశువైద్యాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి – లక్కవరపుకోట

కర్ణాటకలో ఈ నెల 3, 4లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలో మండలంలోని స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థిని షేక్ తనీషా బంగారు పతకం సాధించింది. [illegible] తరగతి చదువుతున్న షేక్ తనీషా 35 కేజీల విభాగంలో అండర్-12లో పాల్గొని కుమితి(ఫైటింగ్) మొదటి స్థానంలో నిలిచింది. కాటాస్‌లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. తనీషాతోపాటు శిక్షకులు రాజాను ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్, వర్లీ షటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా చీఫ్ ఆర్.మల్లికార్జునగౌడ్ అభినందించారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి – బొబ్బిలిరూరల్

బొబ్బిలి తహశీల్దార్‌గా ఎస్.కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ బొబ్బిలి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని చెప్పారు. రెవెన్యూ సమస్యలు, రీ సర్వే, ఇతర దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి – కొత్తవలస

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళపాలెంలోనున్న శ్రీగురుదేవ్ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మంది వైద్యులు క్యాన్సర్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గురుదేవ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీష్, గురుదేవ్ హాస్పిటల్ వైద్యులు ఫణీంద్ర, రాఘవేంద్ర, ఆసుపత్రి సిబ్బంది సుబ్బ ఏర్పాట్లు చేశారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి – వేపాడ

వేపాడలోని విశాఖ డెయిరీ వద్ద శంకర ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 65 మందికి ఆప్తాలమిస్టు రక్తం కంటి పరీక్షలు చేశారు. అందులో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ ఎస్.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బానాదిలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి ఉమ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు.

వేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు : కలెక్టర్

ప్రజాశక్తి – విజయనగరం

నవరత్నాలు కింద పేదలందరికీ మంజూరైన స్థలాల రిజిస్ట్రేషన్లు వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ముందుగా ప్లాట్ల మాపింగ్ జరగాలని, సరిహద్దులు మార్క్ చేసి, డాక్యుమెంట్లు సిద్ధంగా ఉన్న చోట వెంటనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, కేస్ట్ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్లోడ్, నేషనల్ డీ వార్మింగ్, ఎన్నికల మాన్ పవర్ , జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై ఎంపిడిఒ, తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 31 వేల డాక్యుమెంట్ లు రిజిస్ట్రేషన్ కు సిద్ధంగా ఉన్నామని, వాటిని వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే 62 వేలకు గాను 32 వేల బౌండరీలను గుర్తించాలని, అందుకోసం సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. కులగణన త్వరగా పూర్తి చేయాలని అదేశించారు. ఆరోగ్య శ్రీ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జాబితాలను మండలాలకు పంపించామని, వాటిని వెంటనే పరిశీలించి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. .సమావేశంలో జెసి కె.కార్తీక్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డిఒ సూర్య కళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గతనెల 24న విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు సోమవారం కలెక్టరేట్లఓ కలెక్టర్ నాగలక్ష్మి బహుమతి ప్రదానం చేశారు. ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతికి రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ.2వేలు అందజేశారు. వ్యాసరచన పోటీలో వై.యశ్వంత్ (జెడ్‌పిహెచ్‌ఎస్, కెల్ల, గుర్ల మండలం), వై.ప్రణతి (జెడ్‌పిహెచ్‌ఎస్, కుమిలి, పూసపాటిరేగ), బి.మానస (ఎంజెపిబిసిడబ్ల్యూఆర్‌ఎస్, నెల్లిమర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీలో పి.సౌభాగ్య (జెడ్‌పిహెచ్‌ఎస్, నెల్లిమర్ల), పి.శేషాచార్యులు (ఎపిఎంఎస్, మదనాపురం, గంట్యాడ మండలం), ఎం.కీర్తి (కెజిబివి, తెర్లాం) బహుమతులు గెలుచుకున్నారు. డ్రాయింగ్ పోటీలో బి.దుర్గాలక్ష్మి (ఎంజెపిబిసిడబ్ల్యూఆర్‌ఎస్, నెల్లిమర్ల), జి.నాని (జెడ్‌పిహెచ్‌ఎస్, పిఎస్‌ఆర్ పురం, గంట్యాడ), ఎ.హారిక (బిపిఎం హైస్కూల్, విజయనగరం) బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, జెసి

పోటీ పరీక్షల అభ్యర్థులకు స్టడీమెటీరియల్

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

ప్రతిభతో పాటు నిరంతర పరిశ్రమ ద్వారా పోటీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గ్రూప్ 2 పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ సోమవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరయంలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే బాగా చదువు కోవాలన్నారు. పోటీ పరీక్షలకు మరింతగా సాధన చేయాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఏ ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ ఉచితంగా భోజన ఏర్పాట్లు చేసే యోచనలో ఉన్నామన్నారు. త్వరలో ఆ దిశగా కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నిరాశ, నిస్పృహలను వీడి చదువుపై శ్రద్ధ ఉంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, శ్రీనివాస్ ,మండారవి తదితరులు పాల్గొన్నారు.

నూతన పార్కు ప్రారంభం

నగరంలోని విటి అగ్రహారంలో నూతనంగా ఏర్పాటు చేసిన రహదారికి, గాంధీనగర్ లో ఏర్పాటుచేసిన పార్కునకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. రూ.36.50 లక్షలతో విటి అగ్రహారం రహదారిని నిర్మించగా, రూ.18.75 లక్షలతో గాంధీనగర్ పార్కును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, బాలి పద్మావతి మాట్లాడుతూ తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు ప్రజోపయోగ నిర్మాణాలు కూడా చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, సేదదీరే ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి మారం బాల బ్రహ్మారెడ్డి, తాట్రాజు కృష్ణ, బాలి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి – జామి

మండలంలోని గొడుకొమ్ము గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి ఆకస్మికంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో మస్టర్లు, పనిపుస్తకాలను తనిఖీ చేశారు. మేట్లు, కూలీలతో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ, రోజు కూలి రూ.272 వచ్చే విధంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నీడ, మంచినీటి సదుపాయం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌ను ఆదేశించారు. 100 రోజులకు దగ్గరలో ఉన్న వారిని పనిలోకి తీసుకురావాలని, వారితో పనిచేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ ఎం.జగదీశ్, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్‌ఎస్.కేదారేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్.. ఎజెండా కావాలి

యుటిఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం సాధన ఎజెండాగా కావాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్ద గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం రాజకీయ అజెండా కావాలన్నారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించి ఎటువంటి ఉపయోగం లేని జిపిఎస్ విధానం తీసుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఒపిఎస్ సాధన ఎజెండా చెయ్యాలని అన్ని రాజకీయ పక్షాలను కలుస్తామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ సంఘటిత పరిచి ఒపిఎస్ సాధన లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను బలహీన పరిచే జీవో 117ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయక్, ఐక్య ఉపాధ్యాయ సబ్ ఎడిటర్ కె.శ్రీనివాసరావు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్. తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

సభలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం ద్వారా నెల్లిమర్ల అమరవీరుల ప్రాణ త్యాగాలకు సార్థకత చేకూరుతుందని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల స్మారక భవనంలో అమర కార్మికుల 30వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలు పూలదండలు, కొవ్వొత్తులతో నివాలులర్పించారు. ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వర్లు, లక్ష్మి మాట్లాడుతూ 1994లో జ్యూట్ కార్మికుల కోసం ప్రాణ త్యాగం చేసిన ఐదుగురు కార్మికుల త్యాగాలు గుర్తించుకొని వారి బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో కార్మికోద్యమ నేత ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.మల్లయ్య, ఎం.గోపాలం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బి.గీత, కిషోర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షులు వి పార్వతి, ఎఐకెఎమ్‌ఎస్ జిల్లా నాయకులు వి.మల్లేష్ పాల్గొన్నారు.

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి – దత్తిరాజేరు

మండలంలో పి.లింగాలవలసలలో ఆదివారం నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ కెఎ నాయుడు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. స్థానిక నాయకులు పప్పల త్రినాధరావు, ముకుంద సమన్వయంతో మాజీ ఎంపిటిసి కామిరెడ్డి సత్యనారాయణతోపాటు నలుగురు వార్డు మెంబర్లకు కెఎ నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రాన్ని అభివద్ధి చేసిన చంద్రబాబు నాయుడును అక్రమ కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టడం దారుణమని, రాష్ట్ర అభివద్ధి కోసం మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలని అన్నారు. ఆదిశగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దింటి మోహన్ రావు, నాయకులు, మజ్జి మహేష్, బెజవాడ బంగారు నాయుడు, పెద్దింటి జగన్, గుసిడి జగన్నాథం, చెల్లూరు సత్య రావు, కొండబాబు, మరడ రాము, కువైట్ రాము, పలువురు నాయకులు పాల్గొన్నారు

బిసిలకు భరోసా

ప్రజాశక్తి – బాడంగి

బిసిలకు భరోసానిచ్చేందుకే జయహో బిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు టిడిపి కొప్పలవెలమ సాధికార సమితి విజయనగరం పార్లమెంట్ చైర్మన్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం బిసిలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మినహా ఒక్క రూపాయి నిధులు కూడా వెచ్చించలేదని పేర్కొన్నారు. బిసి ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోయిందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిసిలకు రక్షణ కరువైందని చెప్పారు. వారికి రక్షణ కల్పించే దిశగా, భరోసా ఇచ్చేందుకు టిడిపి జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బిసిలకు రక్షణ చట్టం తీసుకువచ్చి అండగా నిలవాలని బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీలో పొందుపరిచిందని వెల్లడించారు. రానున్న ఎన్నికలలో బిసిలు ఐక్యంగా టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

ప్రజలకు మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం పలు డివిజన్లలో రూ.59లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. శంకుస్థాపనల అనంతరం జోనల్ ఇంచార్జ్ బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మీడియాతో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సైతం రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో రూ. 58 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపనలు చేశారు. 26, 27, 32, 34, 37 డివిజన్లలో రోడ్లు కాలువల నిర్మాణాలకు, 38వ డివిజన్లో సామాజిక భవనానికి నిర్మాణానికి ఆమె సోమవారం నాడు శంకుస్థాపన చేశారు డివిజన్ల కార్పొరేటర్లు దుప్పాడ సునీత, బాలి పైడిరాజు, తొగురోతు సంధ్యారాణి, రామకృష్ణ, భోగాపురపు లక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీధర్‌కు సత్కారం

ప్రజాశక్తి – బొబ్బిలి

డిఎస్‌పి పి.శ్రీధర్‌ను బ్రహ్మకుమారీలు సత్కరించారు. డిఎస్‌పి శ్రీధర్‌కు ఎసిబికి బదిలీ కావడంతో సోమవారం సాయంత్రం బ్రహ్మకుమారీలు భవనంలో ఆయన్ను సత్కరించి వారి సేవలను కొనియాడారు. బొబ్బిలిలో విధులు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీధర్ అన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకారంతో సంతృప్తిగా విధులు నిర్వహించామని చెప్పారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బంగారయ్యపేట, కెజిపూడి ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు, టీచర్స్ డైరీలు, పాఠ్యాంశ ప్రణాళిక, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం జిటిడబ్ల్యుఎహెచ్‌ఎస్‌లో పదో తరగతి పరీక్షలకు సంబంధించి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పికెఆర్‌పురం, రామస్వామిపేట, బొద్దాం పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు.

ఎస్‌సి జాబితాలో చేర్చాలని 19న ధర్నా

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి జంపన్న తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రజకులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కోశాధికారి రాజారావు ఉపాధ్యక్షులు తాతారావు, కార్యవర్గ సభ్యులు రాము దేవుడుబాబు పాల్గొన్నారు.

సాయం చేయడం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి – గుర్ల

మానవ సమాజంలో ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణం అలవాటు చేసుకోవాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘ, హ్యూమన్ రైట్స్ జిల్లా మహిళా ప్రతినిధి పద్మలత అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో పాఠకులు కూర్చొని చదువుకునేందుకు వీలుగా రూ.6వేలు విలువ చేసే కుర్చీలను ఆమె చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఐ కామేశ్వరరావు మాట్లాడుతూ వితరణ చేయడం చాలా అరుదుగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు మంచిగా ఆలోచించి తోటి వారికి సాయం చేయాలన్నారు. గ్రంథాలయాధి కారి రామారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇక్కడికి వచ్చి చదువుకోవాలన్నారు. విజ్ఞానం వల్ల మనిషి క్రమశిక్షణ నడవడిక మారుతుందన్నారు. కార్యక్రమం లో విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు భద్రత

ప్రజాశక్తి – నెల్లిమర్ల

నగర పంచాయతీలో మరుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు జీవన భద్రత, ఉపాధి కోసం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిసిమ్ సమన్వయకర్తలు స్వచ్ఛాంద్ర కార్పోరేషన్ కేంద్రంగా సిద్ధం చేసినట్లు కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరుగు,సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రతా, ఉపాధి కోసం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజెడ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ తరపున సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా నగర పంచాయతీ పరిధిలో కార్మికుల గుర్తింపు నమోదు ప్రక్రియ ఈనెల 6న చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైతే ప్రత్యక్షంగాగాను పరోక్షంగాను పాల్గొంటున్నారో వారి వివరాలను పంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో 10 మందికి గాయాలు

ప్రజాశక్తి – వంగర

మండలంలోని చిన రాజులగుమడ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. రాజాం నుంచి కోతుల గుమడ వెళ్తున్న ఆర్‌టిసి బస్సు రాజులగుమడ నుంచి చెరకు పనులు ముగించుకొని ఆటోలో స్వగ్రామం శివ్వాం వెళ్తున్న ప్రయాణికులను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మంది వరకు గాయపడ్డారు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు అంబులెన్సులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాజాంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కలమట రథాలు, బడే శంకర్, కృష్ణవేణి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పాలకొండ ఆర్‌టిసి డిపో మేనేజర్ డి.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

175 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి – చీపురుపల్లి

అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని చీపురుపల్లి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ కె.కుమార్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఒక మోటారు వాహనంపై అక్రమ మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో మా సిబ్బందితో కలసి రైడ్ చేశాం. మండలంలో ఇటకర్లపల్లి గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆ వ్యక్తుల నుండి 175 మద్యం బాటిళ్లను పట్టుకున్నాం అని ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి – రామభద్రపురం

ఆరికతోట జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న సాధారణ తనిఖీల్లో అక్రమ మద్యం పట్టుబడినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. దత్తిరాజేరు మండలం కోరపుకొత్తవలస గ్రామానికి చెందిన వ్యక్తి ఆరికతోట ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 28 మద్యం సీసాలు గొలుసు దుకాణానికి తరలిస్తున్నాడు. ఆయన్ను పట్టుకొని సీసాలు సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐ అప్పారావు, కానిస్టేబుల్ నాగార్జున పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24-02-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 184.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 80088 12798

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL AND DISTRICT JUDGE VIZIANAGARAM
FOR GRANT OF PERMISSION TO SELL THE PROPERTY OF MINOR DAUGHTER/SON
G.O. P. 34 /2023

1.Sri Karri Umamahesara Rao, S/o Nageswara Rao R/o Door No. 8-23-21, Balaji Nagar, Thotapalam, Vizianagaram town.
2. Karri Anish, S/o Umamahesara Rao,(M) (14 years) R/o Door No 8-23-21, Balaji Nagar. Thotapalam. Vizianagaram town.--PETITIONERS
VS
II. The Respondent is : Nil

పై నెంబరు దావాలో 1వ పిటిషనర్ 2వ పిటిషనర్ (మైనర్) తండ్రి. 2వ పిటిషనర్‌కు ఈ క్రింది షెడ్యూల్ ఆస్థి వారి తాత గారైన కర్రి నాగేశ్వరరావు గారి నుండి తే 30-9-2015 ది గిఫ్ట్ డీడ్ నెంబరు 6109/2015 విజయనగరం వెస్ట్ సబ్ రిజిస్టరు ద్వారా దాఖలు పడినది. 2వ పిటిషనర్ (మైనరు) బాగోగులు మరియు చదువు కొరకు ఆ ఆస్తిని అమ్ముటకు సెక్షన్ 8(2) మైనరిటీ గార్డియన్ చట్టం ప్రకారం 1వ పిటిషనర్ (గార్డియన్) అనుమతి కొరకు పై కోర్టులో పై దావా వేసియున్నారు. ఈ విషమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల **తే29-02-2024దిన ఉ॥10:30 గం॥ల నుండి సా॥ 5గం॥ లోపల** పై కోర్టులో వారి అభ్యంతరములు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని తెలియపరచవలెను. ఎంటువంటి అభ్యంతరములు రాని ఎడల వారి అభ్యర్ధనను అనుమతి ఇచ్చుదురు.

SCHEDULE OF THE PROPERTY
All that part and parcel of the land measuring an extent of 49.80 Sq.yds undivided, unspecific share out of the total extent of 2825.66 Sq.yds together with an extent of 1325 Sft including common areas, and 100 Sft car parking, Flat no-105 in Ground floor, in ANANDA PLAZA, constructed in the lane of Door No 8-30-1, covered by S.No 84/1,83 and 83/5 part Vizianagaram 1st bit, Vizianagaram Municipality, Vizianagaram Sub Register office, Vizianagaram District.
Flat Boundaries :
East: Open to Sky & Lift **South:** Open to Sky
West: Open to Sky **North:** Corridor
C S BHAGAVAN
ADVOCATE, VIJIANAGARAM.